Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 237 | హైదరాబాద్ | శనివారం 11 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# 117 సీట్లు మావే!

## ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి

2029 మే – జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ స్థానాలు 182కు, ఎంపీ సీట్లు 26కు పెరుగుతాయి

కాంగ్రెస్ 117 ఎమ్మెల్యే సీట్లు, 20 ఎంపీ స్థానాల్లో గెలుస్తుంది

ఇది భద్రాచలం రాముడి మీద ఆన.. కాస్కో కేసీఆర్

రైతుల కోసం 30 నెలల్లో 1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టాం

కోట్లాది మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్న ముఖ్యమంత్రి

రైతుభరోసా కింద రూ.1,009 కోట్ల నిధులు విడుదల

ఖమ్మం: 'గత ఎన్నికలకు ఆరు నెలల ముందే జోస్యం చెప్పా. ఇప్పుడు 2029 ఎన్నికల జోస్యం 36 నెలల ముందు ఖమ్మం గడ్డ మీద నుంచి చెబుతున్నా. అసెంబ్లీ ఎన్నికలు 2029 మే -- జూన్ మధ్య జరుగుతాయి. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ సీట్లు 26కి, 119 అసెంబ్లీ నియోజకవర్గాలు 182కు పెరుగుతాయి. 182 శాసనసభ స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలిచి రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. అలాగే 20 ఎంపీ స్థానాలు కూడా కాంగ్రెస్ గెలుచుకుని రాహుల్‌గాందీని ప్రధానమంత్రి చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. కౌరవ వంశంగా ఉన్న కల్వకుంట్ల కుటుంబాన్ని

- మిగతా 2వ పేజీలో



## చెన్నైలో బిగ్ బాష్

డిసెంబర్‌లో ఆస్ట్రేలియా టీ-20 క్రికెట్ ఆరంభ మ్యాచ్

భారత్‌లో తొలిసారిగా విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్

క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించిన మోదీ, అల్బనీస్

మెల్‌బోర్న్: శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్, ఆస్ట్రేలియా నిర్ణయించుకున్నాయి. ఇందుకోసం శుక్రవారం క్రీడా

- మిగతా 2వ పేజీలో



## రుణమాఫీ ప్రమాణం ఏమైంది?

భద్రాద్రి రాముడి సాక్షిగా చేశావు

తెలంగాణకు కాంగ్రెస్ సర్కార్ జల ద్రోహం

సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, జూలై 10 : భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైంది?, రాష్ట్రం సంగతి పక్కన పెడదాం... కనీసం నువ్వు సభ పెట్టిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? సమాధానం చెప్పగ లవా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. మాట తప్పడం, పార్టీలు మారడం నీ రాజకీయ సంస్కృతి రేవంత్‌రెడ్డి.. నాది కాదు అని హరీశ్‌రావు ఎద్దే వా చేశారు. ఖమ్మంలో సీఎం రేవంత్ వ్యాఖ్య లపై హరీశ్‌రావు శు క్రవారం ఒక ప్రకటనలో స్పందించారు. ఒకవైపు 'చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దాం' అంటూ.. మరోవైపు ప్రతి బహిరంగ సభలో ఎందుకంత ఆవేశంతో, అసహనంతో రగిలిపోతున్నావు? అని మండిప డ్డారు. కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయని

- మిగతా 2వ పేజీలో



## ఐఎస్ఎస్‌కు భారతీయ సంతతి వ్యోమగామి మీనన్

జూలై 14న ప్రయోగం

వాషింగ్టన్: భారతీయ సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ (49) అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనం కానున్నాడు. ఈ నెల 14న కజకిస్తాన్‌లోని బైకనూర్ కోస్మోడ్రోమ్ నుంచి రోస్‌కోస్మోస్ సోయుజ్ ఎంఎస్29 వ్యోమనౌకలో రష్యన్ కొాస్మోనాట్లు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాతో కలిసి ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఎనిమిది నెలలపాటు గడపనున్నాడు. దీర్ఘకాలంపాటు అంతరిక్ష ప్రయాణం చేస్తే శరీరంపై ఎలాంటి ప్రభావం పడుతుందో తెలుసుకునేందుకు

- మిగతా 2వ పేజీలో

# ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నివారణకు ఏఐ

హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రజా భద్రతను మెరుగుపరచడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అధికార యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ అధ్యక్షతన టీజీఐసీసీసీలో శుక్రవారం కీలక సమన్వయ సమావేశం జరిగింది.

అత్యాధునిక సాంకేతికతతో ఉల్లంఘనులకు చెక్

ప్రయాణికుల భద్రతే లక్ష్యం: సిటీ సీపీ సజ్జనార్

జీహెచ్ఎంసీతో సమన్వయ సమావేశం

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

ఈ భేటీలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఐఏఎస్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్‌లతోపాటు ఎన్‌హెచ్ఏఐ, జీహెచ్ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీలు, అదనపు డీసీపీలు పాల్గొన్నారు. గత మే నెలలో ఓఆర్ఆర్ పై జరిగిన సమన్వయ సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై ఈ సందర్భంగా సమీక్షించారు. ఇందులో భాగంగా రహదారి భద్రతపై తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు 80 క్రిటికల్ స్పాట్స్ ను గుర్తించినట్లు, వీటిలో ఇప్పటికే కొన్ని చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టం చేసినట్లు వివరించారు. ఓఆర్ఆర్ పై ప్రమాదాల నివారణకు ఏఐ ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకువచ్చే అవకాశాన్ని పరిశీలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను సులభంగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని, దీనివల్ల పదే పదే నిబంధనలను ఉల్లంఘించే ధోరణికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఓఆర్ఆర్ పై నమోదవుతున్న ఉల్లంఘనల్లో దాదాపు 99 శాతం వాహనాలు రీపీటెడ్ వైలేషన్స్ కు పాల్పడుతున్నాయని, అలాంటి వాహనదారుల్లో మార్పు తీసుకువచ్చేందుకు

- మిగతా 2వ పేజీలో





## ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు, పేలుళ్లు

తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటన

బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌పై ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్

దుబాయ్: ఇరాన్‌పై వరుసగా వైమానిక దాడులు జరగడం తీవ్ర కలకలం సృష్టించింది. తాము దాడులు పూర్తిస్థాయిలో నిలిపివేశామని

- మిగతా 2వ పేజీలో



## సాగునీటి కోసం పోరుబాట

మరో జలసాధన ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ శ్రీకారం

సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజాక్షేత్రంలోకి...

ఎక్కడికక్కడ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి పదును

కాళేశ్వరం పరీవాహక రైతులతో భారీ సభకు యోచన

జిల్లాల్లో రిజర్వాయర్ల సందర్శనకు షెడ్యూల్‌పై కసరత్తు

## తెలంగాణపై బీజేపీ ఫోకస్

క్యూ కడుతున్న పార్టీ పెద్దలు

ఇప్పటికే ప్రధాని మోదీ పర్యటన

జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కూడా..

తర్వలో మరికొంత మంది నాయకులు

వారానికి.. పదిహేను రోజులకు ఒకరు వచ్చేలా ప్లాన్

రాష్ట్రంలో నడిపించే నాయకుడు కావాలి

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)



తెలంగాణపై బీజేపీ ఫోకస్ పెంచింది. పశ్చిమ బెంగాల్‌లో విజయం తర్వాత నెక్ట్స్ టార్గెట్ తెలంగాణగా పెట్టుకుంది. తెలంగాణ ఎన్నికలు ఇప్పట్లో లేకపోయినా, ఎన్నికల వ్యూహాలకు కమలనాథులు పదును పెడుతున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ పెద్దలు తెలంగాణకు క్యూ కడుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆ పార్టీ నేతల కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సాక్ష్యాత్తు ప్రధాని నరేంద్రమోదీతో పాటు జాతీయ అధ్యక్షుడు, పార్టీలోని పెద్దలు తెలంగాణకు వస్తున్నారు. మేలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొన్ని రోజుల గ్యాప్ ఇచ్చి జూన్‌లో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటించారు. మూడురోజుల పాటు ఇక్కడే ఉంటూ లీడర్లకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎలా సన్నద్ధంగా ఉండాలో కూడా తెలియజేశారు. ఇటీవల కేంద్రమంత్రి

- మిగతా 2వ పేజీలో

# రుణమాఫీ ప్రమాణం ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి)

నీ చేతగాని తనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకో వాలని చూడటం హీనమైన చర్య అని విమర్శిం చారు. 28 లక్షల వరద వచ్చినప్పుడే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు చెక్కు చెదరలేదు.. లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న ప్రస్తుత సమయంలో ఏదో జరుగుతుందని ఎందుకు భ్రమలు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జలాలను తన గురువు చంద్రబాబుకు కప్పం కడుతున్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. ఒక వైపు ఎల్ నినో ప్రభావం ఉన్నా తెలంగాణలో గోదావరి జలాలు గలగలా ప్రవహిస్తున్నాయి.. అయినా ఆ నీటిని ఒడిసిపట్టకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెడుతున్న రేవంత్ సర్కారు తెలంగాణకు జలద్రోహం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభు త్వం నీటిని వదిలేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తమపట్నం, పుష్కర ఎత్తిపోతల ద్వారా రోజుకు మూడు టీఎంసీల చొప్పున ఇప్పటికే 60 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుం దన్నారు. దేవాదుల నుంచి కిందికి వెళ్తున్న గోదావరి నీటిని ఏపీ ప్రభుత్వం వినియోగించుకుం టుంటే, తెలంగాణ చేతులెత్తేయడం రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# ఐఎస్ఎస్‌కు భారతీయ సంతతి వ్యోమగామి మీనన్

(మొదటి పేజీ తరువాయి)

మీనన్ ఐఎస్ఎస్‌లో ప్రయోగాలు నిర్వహించనున్నారు. అతితక్కువ గురుత్వాకర్షణ శక్తి పరిస్థితుల్లో శరీరంలో రక్త ప్రసరణతోపాటు సిరల నిర్మాణం, రక్తసాంద్రతల్లో వచ్చే మార్పులను పరిశీలిస్తారు. అంతరిక్ష కేంద్రంలోని తాగునీటి వ్యవస్థతో ఐవీఫ్లూయిడ్స్‌ను తయారు చేసేందుకు సిద్ధం చేసిన టెక్నాలజీలను పరీక్షిస్తారు. ఇలాంటి మిషన్లలో భూమి నుంచి ఎలాంటి వైద్యసాయం అవసరం లేకుండానే ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐలతో పనిచేయగల టెక్నాలజీలను పరీక్షిస్తారు. కంప్యూటర్లు, ఏఐ, వైద్య పరికరాలకు అవసరమైన సెమీకండక్టర్ స్ఫటికాల తయారీ పద్ధతులను సమీక్షిస్తారు. కేరళ నుంచి అమెరికా వలస వెళ్లిన శంకరన్, ఉక్రెయిన్ నుంచి వలస వచ్చిన లిసా సామోయిలింకోల సంతానమైన అనిల్ మినియాపోలిస్‌లో జని?మంచారు.

# తెలంగాణపై బీజేపీ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించారు. ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కీలక నేతలతో సమావేమయ్యారు. ఎన్నికలకు సన్నద్ధం కావాలని, విభేదాలు లేకుండా పార్టీ విజయం కోసం ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ఆయన మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఆ షకామెంట్స్ హాట్‌టాపిక్‌గా మారాయి.

**మరికొందరు నేతలు కూడా..**

తెలంగాణపై గురి పెట్టిన బీజేపీ మరికొందరు నేతలను కూడా క్రమం తప్పకుండా పర్యటించేలా ప్లాన్ చేస్తోంది. కేంద్ర మంత్రులు, కీలక నేతలు వారనికో పదిహేను రోజులకో ఒకసారి తెలంగాణను టచ్ చేసి వెళ్తారని సమాచారం. ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

**నాయకత్వమే అసలు సమస్య**

బీజేపీ అగ్రనేతలు తెలంగాణపై గురి పెట్టడం అయితే చేస్తున్నారు కానీ, రాష్ట్రంలో పార్టీకి చరిష్మా ఉన్న నాయకుడు లేడన్నది నిర్వివాదంశం. ప్రధాని నరేంద్ర మోదీ హవాలో తెలంగాణలో మంచి ఫలితాలే వస్తున్నా.. నడిపించే నాయకుడు బలంగా ఉంటే మరింత ప్రయోజనం ఉంటుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్న సమయంలో అంతో ఇంతో మాస్‌గా పార్టీ జనంలోకి వెళ్లింది. రాష్ట్ర రాజకీయాల్లో ఓ వైపు రేవంత్‌రెడ్డి దూసుకుపోతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అధికారం తమదే అని ఢంకా బజాయించి చెబుతోంది. ఈ క్రమంలో రాష్ట్రంలో పార్టీని నడిపించే నాయకుడు కావాలని కిందిస్థాయి కార్యకర్తలు అభిలషిస్తున్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ ప్లాన్ వర్కవుట్ అవుతుందా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# సాగునీటి కోసం పోరుబాట

## మరో జలసాధన ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ శ్రీకారం

## సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజాక్షేత్రంలోకి...

## ఎక్కడికక్కడ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి పదును

## కాళేశ్వరం పరీవాహక రైతులతో భారీ సభకు యోచన

## ప్రాజెక్టు పరిధిలోని జిల్లాల్లో రిజర్వాయర్ల సందర్శనకు షెడ్యూల్‌పై కసరత్తు

హైదరాబాద్: తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన నీళ్ల నినాదం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో కేంద్రబిందువుగా మారుతోంది. వర్షాభావం, అడుగంటుతున్న జలాశయాలు, పంటల సాగుకు ప్రతికూల పరిస్థితులు రాష్ట్ర రైతాంగం మెడపై కత్తిలా వేలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో సాగునీరు, రైతాంగ సమస్యలను అస్త్రంగా చేసుకొని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఉద్యమ రూపంలో తీసుకెళ్లే కార్యాచరణకు బీఆర్ఎస్ పదును పెడుతోంది. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా గణాంకాలు, సాంకేతిక వివరాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యూహాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి గోదావరిలో వృథాగా పోతున్న నీటిని ఎత్తిపోయడంలో రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. 31 నెలలుగా కాళేశ్వరంపై వాస్తవాలను ప్రభు త్వం దాచి పెడుతోందని ఆరోపించిన కేటీఆర్.. తమకు ప్రాజెక్టు నిర్వహణను అప్పగిస్తే నీటిని ఎలా ఎత్తిపోయాలో చూపిస్తామని సవాల్ చేశారు. మరోవైపు అసెంబ్లీలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, మేడిగడ్డ బరాజ్ మరమ్మతుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూడు నెలలు తనకు నీటిపారుదల శాఖను అప్పగిస్తే కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోసి చూపిస్తానని సవాల్ విసిరారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, వరంగల్, మెదక్ జిల్లాల్లోనూ బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఆందోళనలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో సాగునీటి ప్రాజెక్టుల కేంద్రంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. అయితే కేవలం సవాళ్లు, ప్రతిసవాళ్లకు పరిమితం కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టు పరీవాహక ప్రాంత రైతులతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని భావిస్తోంది. ఆలోగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని జిల్లాల్లో సభలు, సమావేశాలు, బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల సందర్శన వంటి కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోంది.

**రైతుల భాగస్వామ్యంతో ఉద్యమం**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, పంటల ప్రణాళిక అత్యంత కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ఇదే అంశాన్ని రాజకీయ కోణంలో బలంగా ప్రస్తావిస్తున్న బీఆర్ఎస్.. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ముందస్తు ప్రణాళిక లేకపోవడాన్ని తప్పుబడుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులు, రైతుల వద్దకే నేరుగా వెళ్లి ఉద్యమ కార్యాచరణను అమలు చేయాలనుకుంటోంది. ఎస్సారెస్పీ వరద కాలువకు నీటిని విడుదల చేయాలనే డిమాండుతో రైతులతో కలిసి ఆందోళనలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. తుంగభద్ర నదిపై కర్ణాటక, ఏపీ చేపడుతున్న ప్రాజెక్టులతో తెలంగాణకు నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీఆర్ఎస్ నేతల బృందం రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌ను సందర్శించింది.

# 117 సీట్లు మావే!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ గడ్డ మీది నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమించరు. ఇది భద్రాచలం రాముడి మీద ఆన. కాస్కో చంద్రశేఖర్‌రావు...' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ వద్ద జరిగిన రైతు ఆశీర్వాద సభలో చివరి విడత రైతుభరోసా కింద రూ.1,009 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

**అప్పుడు 65 సీట్లు గెలుస్తామని చెప్పా..**

'2023 జూలైలో భట్టి పాదయాత్ర ముగింపు, పొంగులేటి కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా ఖమ్మంలో రాహుల్‌గాంధీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ఖమ్మం జిల్లా ప్రజలు లక్షలాదిగా ఉప్పెనై వచ్చారు. ఈ సభ తర్వాత గాన్యదీభవన్‌లో పాత్రికేయ మిత్రులు కలిసి బీజేపీ వేగంగా వస్తోంది, బీఆర్ఎస్, కేసీఆర్ మాయమాటలు, మూటలను తట్టుకుని ఎన్నికల్లో ఎలా గెలుస్తారు? అని అడిగారు. కానీ ఖమ్మం సభ చూశాక కాంగ్రెస్ పార్టీ నుంచి 65 మంది ఎమ్మెల్యేలు గెలుస్తారు, సీపీఐ ఒక్క సీటు గెలుస్తుంది, బీజేపీ 8 --9 సీట్లు, ఎంఐఎం 6--7 సీట్లు పోగా మిగిలిన చోట్ల మాత్రమే కేసీఆర్, కేసీఆర్ భజనపరులు గెలుస్తారని చెప్పా. అదే తరహాలో కాంగ్రెస్ 64 సీట్లు గెలవగా.. ఉప ఎన్నికల్లో ప్రజలు మరో రెండు సీట్లు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ అలాగే జరిగింది. ప్రజాతీర్పు ద్వారా పాపాల భైరవుడిని ఫార్మ్ హౌస్‌లో బంధించినం..' అని రేవంత్ అన్నారు.

**అన్నం తినేటోడు ఇప్పుడు సర్వేలు చేయిస్తడా..**

'రేవంత్‌రెడ్డి సర్వే చేసుకుంటే మేము గెలుస్తున్నామని వచ్చిందని మాట్లాడుతున్నారు.. అన్నం తినేటోడు ఎవడన్నా ఎన్నికలు ఎన్నడు ఉంటాయో తెలవకుండా సర్వేలు చేయిస్తడా?..' అని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం విమర్శలు చేశారు. 'మొన్న కన్నెపల్లి పోయిండు. మేడిగడ్డలో నీళ్లు నింపండి, కన్నెపల్లి ఎత్తండన్నడు. మేడిగడ్డ గేట్లు దించి నీళ్లు నిలబెడితే.. రేపు తెగిపోతే భద్రాచలం రాముడే ఉండడు. ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోతాయి. నీ లుచ్చా రాజకీయాల కోసం మేడిగడ్డ నింపి, భద్రాచలం కొట్టుకుపోయేటట్టు చేయాల్నా?..' అని మాజీమంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి రేవంత్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

**ఉచిత కరెంట్‌పై సంతకం చేసింది వైఎస్సార్**

'రైతుల కోసం 30 నెలల కాలంలో రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టాం. సన్న బియ్యంతో కోట్లాది మంది ప్రజలకు బుక్కెడు బువ్వ పెట్టే కార్యక్రమం జరుగుతోంది. రైతును రాజును చేయాలన్న ఆలోచనతో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేసిన ఘనత కాంగ్రెస్‌ది. ఉచిత కరెంటు మా పేటెంట్. 2004లో ఎల్‌బీ స్టేడియంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొట్టమొదటి సంతకం పెట్టి, రైతాంగానికి ఉచిత కరెంట్ అందించడంతో పాటు రైతుల మీద ఉన్న వేల కేసులను తొలగించారు..' అని సీఎం తెలిపారు.

**రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దాం..**

'మోదీ, అమిత్ షా.. మమతా బెనర్జీ పార్టీ, ఆప్‌ను చీల్చి, ఇతర పార్టీలను లొంగతీసుకుని సీట్లు పెంచాలన్న బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ పాపంలో వాళ్లు విజయం సాధించడానికి అవకాశం ఉంది. అందుకే రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయి. ఈనెల 20న ఢిల్లీకి వెళు న్నా, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాన్యదీని కలుస్తున్నా. 26 పార్లమెంట్ సీట్లలో 20 సీట్లు తెలంగాణ నుంచి మేము అందిస్తామని చెప్పదలుచుకున్నా. ఖమ్మంలో, ఇదే ప్రాంతంలో 5 లక్షల మందిని ఆహ్వానించి రాహుల్‌గాంధీతో సభ ఏర్పాటు చేస్తాం. భద్రాద్రి రాములోరి ఆశీర్వాదంతో రాహుల్‌గాన్యదీని దేశానికి ప్రధానమంత్రిని చేసేవరకు మనం విశ్రమించొద్దు..' అని రేవంత్ పిలుపునిచ్చారు.

**మొక్కజొన్న రైతులకు రూ.3,504 కోట్లు**

సభావేదిక పైనుంచి రైతు భరోసా నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో పాటు, యాసంగి సీజన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్నకు గాను రైతులకు రూ.3,504 కోట్లు సీఎం విడుదల చేశారు. భూధార్‌కు సంబంధించి పైలట్ గ్రామంగా సర్వే పూర్తి చేసిన ఖమ్మం జిల్లా ములుగుమాడులోని రైతులు ముగ్గురికి లాంఛనంగా ఈ--పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేశారు.

**అవన్నీ చెక్కు చెదరలేదు..**

**కాళేశ్వరం కూలిపోయింది: భట్టి**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు దశాబ్దాలైనా చెక్కు చెదరలేదని, కొన్ని వందల టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టులు ఇప్పటికీ నీళ్లు అందిస్తుంటే.. ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచి?చన బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని ఎద్దేవా చేశారు. 'గోదావరిపై ప్రాజెక్టులతో రూ.లక్షల కోట్లు దోపిడీ చేశారు. దోపిడీలకు పాల్పడే ఇలాంటి గుంటనక్కలు, తోడేళ్లను రాష్ట్రంపై మరోసారి పడనివ్వబోం..' అని భట్టి అన్నారు.

**ప్రతీ గజాన్ని సర్వే చేస్తాం: పొంగులేటి**

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 'భూభారతి ద్వారా ప్రస్తుతం 70 గ్రామాల్లో సర్వే చేస్తున్నాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని ప్రతి గజాన్ని సర్వే చేసి సాగులో ఉన్న వారికి మ్యాప్‌తో భూధార్ కార్డు ఇస్తాం..' అని తెలిపారు. ఇప్పటికే రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారని, మళ్లీ ఎన్నికలు వచ్చినా బుద్ధి చెబుతారని అన్నారు.

**30 మాసాల్లో 36వేల కోట్ల రైతుభరోసా:తుమ్మల**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుభరోసా కింద 30 మాసాల కాలంలో రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.72 వేల కోట్లు మాత్రమే జమ చేసిందని విమర్శించారు. ఈ సభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు వాకిటి శ్రీహరి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, డాక్టర్ రాంచందర్ నాయక్, ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, నవీన్‌యాదవ్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, ఈర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నైలో బిగ్ బాష్

(మొదటి పేజీ తరువాయి)

సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. ఇందులో భాగంగా తమిళనాడు రాజధాని చెన్నైలో బిగ్ బాష్ లీగ్ (టీ-20) ఆరంభ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం (చేపాక్) వేదికగా జరగనున్న ఆస్ట్రేలియన్ మెన్స్ బిగ్ బాష్ లీగ్(బీబీఎల్) ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పెర్త్ స్కార్చర్స్ జట్టుతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తలపడనుంది. తద్వారా భారతదేశంలో ఒక విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం ఇదే మొదటిసారి కానుంది. మొదటి మ్యాచ్ చెన్నైలో, మిగిలిన మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరుగుతాయి. ఎనిమిది జట్లు పాల్గొనే బీబీఎల్.. ఐపీఎల్ తర్వాత ప్రపంచంలోనే అత్యధిక ఆదరణ పొందిన దేశీయ క్రికెట్ టీ--20 లీగ్‌లలో ఒకటి కావడం విశేషం. ఇది సాధారణంగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో జరుగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ శుక్రవారం ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇద్దరు నేతలు స్టేడియం అంతటా కలియతిరుగుతూ సందడి చేశారు. ఫోన్‌లో సెల్ఫీలు దిగారు. ఫొటోలకు పోజులిచ్చారు. ప్రజలకు అభివాదంచేస్తూ ఉత్సాహపర్చారు. పరస్పరం ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం నాకు సంతోషంగా ఉంది. భారతదేశంలో మ్యాచ్‌లు నిర్వహించే ఏ క్రీడా లీగ్ అయినా భారీగా ప్రేక్షకులను ఆకర్షించడం ఖాయం"అని మోదీ పేర్కొన్నారు. భారత్--ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను మోదీ, అల్బనీస్ సంయుక్తంగా విడుదల చేశారు. క్రీడా శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్యాలను ప్రోత్సహించాలన్నదే ఈ రోడ్‌మ్యాప్ ఉద్దేశం. రోడ్‌మ్యాప్‌లో భాగంగా యువ క్రీడాకారుల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి, క్రీడా సంబంధాలను బలోపేతం చేయడానికి ఇరు దేశాలు యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించబోతున్నాయి. ప్రజలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉందని, ఈ రోడ్‌మ్యాప్ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచినందుకు ఆస్ట్రేలియాను అభినందిం చారు. భారత్, ఆస్ట్రేలియాలు అంతర్జాతీయ క్రీడల్లో ఒక ముఖ్యమైన దశాబ్దంలోకి అడుగుపెడుతున్నాయని పేర్కొ న్నారు. క్రీడల పట్ల ఉన్న ప్రేమ, అభిరుచి ఆస్ట్రేలియా, భారత్‌ను ఐక్యం చేశాయని ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ వ్యాఖ్యానించారు.

**విపక్ష నేతతో మోదీ భేటీ**

ఆస్ట్రేలియా ప్రతిపక్ష నాయకుడు యాంగస్ టేలర్‌తో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు. మోదీ మూడు రోజుల ఆస్ట్రేలియా పర్యటన శుక్రవారం ముగిసింది

# ఓఆర్ఆర్‌పై ప్రమాదాల నివారణకు ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఓఆర్ఆర్ పై వాహనాలు మొరాయించడం (బ్రేక్ డౌన్) వంటి ఘటనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని, ఇలాంటి వాహనాలను వీలైనంత త్వరగా అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్డుపై ఎక్కడా వాహనాలు నిలపకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకవేళ వాహనాలు ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఓఆర్ఆర్ పై ప్రయాణికుల రక్షణే పరమావధిగా హెచ్ఎండీఏ తరఫున అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఓఆర్ఆర్ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పనిచేస్తూ.. తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన రక్షణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కీలక సమావేశంలో హైదరాబాద్ అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ సన్ ప్రీత్ సింగ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఐఆర్బీ సీనియర్ జనరల్ మేనేజర్ చాంద్ భాషా, ఎన్‌హెచ్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రవణ్ ప్రకాశ్,



ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ హెడ్ ఎం. గిరిశ్వర్, ఎన్‌హెచ్ హైదరాబాద్ సైట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాను మిశ్రా, జీహెచ్ఎంసీ సీనియర్ ఇంజనీర్లు నరేందర్ గౌడ్, కిష్టప్ప పాల్గొన్నారు. వీరితో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, సైబరాబాద్ కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ ఎస్. రవి కుమార్, పలువురు ట్రాఫిక్ అదనపు డీసీపీలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా ప్రకటించిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. తాజా అనుమానాస్పద దాడులతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్నది ఎవరన్నది అంతుబట్టడం లేదు. దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఖననం చేయడానికి ఇరాన్ సన్నద్ధమవుతున్న తరుణంలోనే గురువారం దక్షిణ ఇరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగాయి. దీనికి కారణం ఎవరన్న దానిపై ఇరాన్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా సాగిస్తున్న ప్రచారానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు ఇస్తోందంటూ ఇరాన్ చట్టసభ సభ్యుడు ఒకరు ఆరోపించారు. అమెరికాకు సహకరించినందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇటీవల అమెరికా చేసిన దాడుల్లో యూఏఈ తెర వెనుక పాత్ర పోషించిందని మండిపడ్డారు. ఇరాన్‌పై తాజా వైమానిక దాడుల పట్ల గల్ఫ్ దేశాలు కూడా స్పందించలేదు. ఇరాన్ బద్ధశత్రువైన ఇజ్రాయెల్ కూడా మౌనం వహించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు కీలక జలమార్గమైన హోర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, నౌకల రవాణాకు వీలు కల్పించాలని అమెరికా పట్టుబడుతున్న తరుణంలో ఇరాన్‌పై వరుసగా దాడులు జరిగాయి. హోర్మూజ్ ఇకపై పూర్తిగా తమ నియంత్రణలోనే ఉండాలని, నౌకలు రాకపోకలు సాగించాలంటే తమకు రుసుములు చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.

**నాలుగు దేశాల్లో మిస్సైల్ అలర్ట్ సైరన్లు**

ఇరాన్‌లోని బుషెహర్, సిస్తాన్, బలూచిస్తాన్ ప్రావిన్స్‌లతోపాటు అహవాజ్, చాబహార్, ఇతర ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగాయని, పలుచోట్ల పేలుళ్లు చోటుచేసుకున్నాయని స్థానిక మీడియా గురువారం సాయంత్రం వెల్లడించింది. అయితే, గురువారం ఉదయం తర్వాత తాము ఎలాంటి దాడులకు పాల్పడలేదని అమెరికా రక్షణ వర్గాలు తెలిపాయి. సాయంత్రం జరిగిన వైమానిక దాడులతో తమకు సంబంధం లేదని వివరణ ఇచ్చాయి. అయితే, ఇరాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌లో పలు లక్ష్యాలపై విరుచుకుపడింది నాలుగు దేశాల్లో మిస్సైల్ అలర్ట్ సైరన్లు వినిపించాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. కువైట్‌లో ఒకరు గాయపడినట్లు సమాచారం. ఇరాన్ దాడికి దిగిన వెంటనే కువైట్ అమీర్(పాలకుడు)తో సమావేశం కావడానికి యూఏఈ నాయకుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ కువైట్‌కు వెళ్లారు. ఖతార్ విదేశాంగ మంత్రితో గల్ఫ్ అరబ్ దేశాల నేతలు ఫోన్‌లో మాట్లాడారు. ఇంతకుముందు యుద్ధ సమయంలో ఇరాన్‌పై అనేక వైమానిక దాడులు జరిగాయి. తమ ఇంధన కేంద్రాలపై ఇరాన్ చేసిన దాడులకు ప్రతీకారంగా సౌదీ అరేబియా, యూఏఈలు ఇరాన్‌పై వైమానిక దాడులు చేశాయని అధికారులు తర్వాత తెలిపారు. ఇరాన్‌పై తాజా దాడులకు ఏదో ఒక గల్ఫ్ దేశం కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు గురువారం రాత్రి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడారు. గల్ఫ్‌లో అమెరికా తీసుకుంటున్న చర్యల గురించి ట్రంప్ నెతన్యాహుకు తెలియజేశారు. అవసరమైతే ఇరాన్‌ను ఎదుర్కోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తేల్చిచెప్పారు.





## రైతులకు అండగా నిలిచిన ఎమ్మెల్యేకు అభినందన సత్కారం

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 10.**

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మొక్కజొన్న రైతుల వినతి మేరకు గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషిచేసి మక్కలు కొనుగోలు చేయడానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేసి,ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే స్పందించి రైతులకు అండగా నిలిచిన సందర్భంగా శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కలిసి ధన్యవాదాలు తెలిపిన లక్ష్మీపూర్ గ్రామ సహకార సంఘం సభ్యులు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా రికార్డు స్థాయిలో మొక్కజొన్న పంట కొనుగోలు చేయటం జరిగింది అని,రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయి అని అన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. 9రోజుల్లో 9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల అయ్యాయి అన్నారు.రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు లాంటి మంచి కార్యక్రమం అమలు చేయడం ద్వారా రైతులకు మేలు జరిగింది అని,రైతులకు పంట సాగు అంశాల పై మెళకువలు,వ్యవసాయం లోనూతన సాంకేతికత లాంటి అంశాలను రైతులకు అవగాహన కల్పించడం జరిగింది అని అన్నారు.రాష్ట్రంలో జిల్లా వారిగా ఉత్తమ రైతులను గుర్తించి ప్రభుత్వం సత్కరించింది అని అన్నారు.సన్న వడ్ల సాగుకు రైతులు ముందుకు రావాలని,ఎల్ నీ నో ప్రభావం పట్ల రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.రైతుల పక్షాన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ గర్వందుల చిన్న గంగయ్య, మాజీ ఆత్మ చైర్మన్ ఏలేటి రాజిరెడ్డి,మాజీ డైరెక్టర్ పూరిపాటి రాజిరెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఛత్తీస్ గడ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు జాడి పుష్ప

- కుటుంబ సభ్యులకు అప్పగించిన తాళ్ల గురజాల ఎస్సై రామకృష్ణ

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 9**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ ముద్దుబిడ్డ బీద ప్రజల కోసం అడవుల బాట పట్టిన మావోయిస్టు జాడి వెంకట్ భార్య జాడి పుష్ప, ఇటీవల కాలంలో అడవులు వదిలి ఛత్తీస్గఢ్ పోలీస్ వారికి లొంగి పొగ వారు గురువారం తాళ్ళగురిజాల పోలీస్ వారికి అప్పగించగా తాళ్ళగురిజాల ఎస్సై రామకృష్ణ, సర్పంచ్ చిలుముల శ్రీనివాస్ ఉపసర్పంచ్ గజెల్లి రాజ్ కుమార్ మాజీ ఉపసర్పంచ్ కంపెల చంద్రశేఖర్ గార్ల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది జాడి పుష్ప,కి ప్రభుత్వం తరుపున గుర్తింపు కార్డు మరియు అన్నివిధాలుగా గ్రామపంచాయతీ తరుపున సహాయసహకారాలు అందిస్తామని మాట ఇవ్వడం జరిగింది.



## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, జూలై-10 (ప్రజాతీర్పు)**

మంథని నుంచి తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్తున్న సమయంలో గాడుదల గండి గుట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు మంథని మండలం లోని ఖాన్ సాయిపేట గ్రామానికి చెందిన కలకొండ తిరుపతిరెడ్డి, బట్టుపల్లి గ్రామానికి చెందిన ఆశా వర్కర్ ఆయిలీ రాజేశ్వరిలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కరీంనగర్‌లోని కె.సి. డయాగ్నస్టిక్ సెంటర్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఆయన, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

## తక్కలపల్లి రవీందర్‌రావును పరామర్శించిన స్వప్న సుదర్శన్‌రెడ్డి

**నర్సంపేట జూలై 10 ప్రజా తీర్పు**



హైదరాబాదు యశోద హాస్పిటల్ లో ఇటీవల ట్రీట్మెంట్ తీసుకొని విశ్రాంతి తీసుకుంటున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్రావు వరంగల్ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిలో గురించి అడిగి తెలుసుకున్నారు..

## పోలీసులకు వార్షిక క్రీడలు
# మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 10.**



క్రీడలతో స్నేహ భావం పొందడంతో పాటు పని ఒత్తిడి నుండి రిలీఫ్ అవడానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అనునిత్యం విధులలో, నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈరోజు ఉదయం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం నందు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. మొదటగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పి తెలిపారు. తదుపరి పరేడ్ మైదానం పరేడ్ ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేయడం జరిగింది. తదుపరి స్పోర్ట్స్ జెండాను అధికారుల సమక్షంలో ఎస్పి ఆవిష్కరించడం జరిగింది. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు తెలియజేస్తున్నటువంటి బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం క్రీడాకారులచే ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా క్రీడలను ఆడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ... మొదటగా క్రీడా పోటీలలో పాల్గొనను న్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీల లోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలియజేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారని వాటిలో ప్రతి ఒక్కరూ పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందవలసిందిగా తెలిపారు. ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పనిచేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు.తదుపరి రన్నింగ్, వాలీబాల్ క్రికెట్ క్రీడలను జిల్లా ఎస్పీ గారు ఆడి క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్సాహపరిచారు. ముఖ్యంగా ఈ క్రీడలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు అందులో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాట్మెంటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ లాంటి వివిధ అంశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ , డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్,కరుణాకర్,రాజకుమార్,లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, సైదులు,వేణు,ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో మంచిర్యాల జిల్లాకు 2వ స్థానం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జులై 9**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ర్యాంకులో మంచిర్యాల జిల్లా 360 స్కోర్ తో రాష్ట్రంలో 2వ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చంద్రయ్య, అధికారులతో కలిసి పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2025-26 నివేదికను విడుదల విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో 324 స్కోర్ తో జిల్లా 3వ స్థానంలో నిలువగా అన్ని విభాగాలలో ప్రతిభను మెరుగుపరచుకొని ఈ సంవత్సరం 360 స్కోర్ తో 2వ స్థానంలో నిలిచిందని, తెలంగాణ రాష్ట్రం తన స్థానాన్ని మెరుగుపరచుకొని జాతీయస్థాయిలో 18 వ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలలో మూత్రశాలలు లేని పాఠశాలలను గుర్తించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ద్వారా పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, తరగతి గదులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాల లకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహాలలో విద్యార్థులకు అదనంగా వసతి గదులు, భోజనశాల, వంటశాల, మూత్రశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్ లు నిర్మించడము, ఆర్ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పరచడం, ఇంటర్మీడియట్ బ్లాక్ లను నిర్మించడం వంటి చర్యలతో పాఠశాలలో మౌలిక వసతులు బలోపేతమై ఎక్కువ స్కోరు సాధించడం జరిగినదని తెలిపారు. పాఠశాలలలో పర్యవేక్షణ మెరుగుపరిచేందుకు దాదాపు 50 మంది సభ్యులతో 8 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి 485 పాఠశాలలను పూర్తి స్థాయిలో సమగ్రంగా తనిఖీ చేయడం జరిగిందని, డిజిటల్ విద్యను బలోపేతం చేయడం ద్వారా డిజిటల్ విద్యా విభాగంలో స్కోరు మెరుగైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు ఎం.భరత్ కుమార్, జంబోజు సత్తయ్య, కృష్ణమూర్తి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



## ఘట్కేసర్ 6వ డివిజన్ లో శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై,10**

జిహెచ్ఎంసి ఉప్పల్ జోన్ ఎం ఎం సి ఘట్కేసర్ సర్కిల్ 6వ డివిజన్ లో శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ఫార్మసిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గాంధీనగర్ బాలాజీ నగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీ కొండాపూర్ వాసులకు మంచి అవకాశాన్ని కల్పించిన హాస్పిటల్ యజమాని పన్నాల శ్రీనివాస్ రెడ్డికి అభినందించారు. ప్రజలకు నాణ్యమైన తక్కువ ధరకే సేవలను కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల్ మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పలుగుల మాధవ రెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్ రావు, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట రెడ్డి, బండారి ఆంజనేయులు గౌడ్, బేతాళ నర్సింగ్ రావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, బొక్క విష్ణువర్ధన్ రెడ్డి గారు. విజయ్ గౌడ్, మందాడి శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, భోగా అర్జున్, బబ్బురి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మయ్య, భానుక నవీన్, పలుగుల శ్రీకాంత్ రెడ్డి, పట్టి మహిపాల్ రెడ్డీ హాస్పిటల్ యజమాని కుటుంబ సభ్యులు, బంధువులు, మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఎండి సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు బెయిల్ మంజూరు. రూ.లక్ష సొంత పూచీకత్తుపై చర్లపల్లి జైలు నుంచి బండి భగీరథ్ విడుదల


**(వినోద్, ప్రజా తీర్పు,మేడ్చల్ జిల్లా) జులై 10**

మేడ్చల్ జిల్లా, హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బండి భగీరథ్‌ను చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి జైలు అధికారులు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. రూ.లక్ష సొంత పూచీకత్తుపై భగీరథ్‌కు బెయిల్ మంజూరు కాగా, ఆయన తరఫు న్యాయవాది బెయిల్ ఉత్తర్వుల ప్రతిని సంబంధిత అధికారులకు అందజేశారు. అవసరమైన న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం చర్లపల్లి జైలు అధికారులు భగీరథ్‌ను విడుదల చేశారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో బండి భగీరథ్ సుమారు 45 రోజులుగా చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో
# డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ

**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జులై 10**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు ఈరోజు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూలై 9**



ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికలు, కార్యాలయ రికార్డులు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాల నమోదు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని, ఈ నెల 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఓటర్ల నుండి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొందుపరిచిన సమాచారాన్ని బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులుగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూభారతి పెండేసి వివరాలను పరిశీలించారు. వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం నెన్నెల మండలం ఆవడం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల తహసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజనం పథకం అమలు, సైన్స్ వేర్ నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, భోజనశాల, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యారంగంలో దేశంలో, రాష్ట్రంలో ఉన్నత స్థానాలలో నిలిచిందని, జిల్లాలో దాదాపు 320 మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, అడ్మిషన్లలో జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో 3 శాతం విద్యార్థుల సంఖ్య పెరిగిందని, ఒక గుర్తింపు ద్వారా 75 శాతం హాజరు నమోదు అవుతుందని తెలిపారు. జిల్లాలో 700 లకు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలలో దాదాపు 44 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో సకల సౌకర్యాలతో విద్యార్థులకు విద్యా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో విద్యారంగంలో 150 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో సి.ఎస్.ఆర్. 80 కోట్ల రూపాయలు, ఈ.జి.ఎస్. 20 కోట్ల రూపాయలు, సమగ్ర శిక్ష 11 కోట్ల రూపాయలు, నాబార్డు 6 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జన్ మన్ 3 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి జుగా 3 కోట్ల రూపాయలతో పాటు ప్రభుత్వ నిధులతో పాఠశాలల అభివృద్ధి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కల్పిస్తున్న సౌకర్యాలతో పాఠశాలలలో అడ్మిషన్లు అడుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసరస్వతీ శిశు మందిర్ లో ఆచార్య నిరంతర ప్రశిక్షణావర్గ ప్రారంభం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 10**

శ్రీ సరస్వతీ విద్యాపీఠం, తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్, కరీంనగర్ విభాగ్ స్థాయి ప్రాథమిక, శిశువాటిక ఆచార్యుల కోసం రెండు రోజుల నిరంతర ప్రశిక్షణా వర్గ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ విభాగ్ అధ్యక్షులు ముక్కాల సీతారాములు, కార్యదర్శి మెచినేని దేవేందర్ రావు, శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవీందర్, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గట్టు శ్రీనివాస్, విభాగ్ ఉపాధ్యక్షులు కోట లక్ష్మారెడ్డి, పాఠశాల సంయుక్త కార్యదర్శి కొత్తూరు ముకుందం, జగిత్యాల జిల్లా సహా కార్యదర్శి బాజోజు శ్రీనివాస్ పాల్గొని ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించడంలో ఆచార్యుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, ప్రతి ఆచార్యుడు సమాజ నిర్మాణంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ శిక్షణా వర్గలో బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, విద్యార్థుల మనోవిజ్ఞానం, విలువల ఆధారిత విద్య, కార్యాచరణ ప్రణాళిక వంటి అంశాలపై సమగ్రంగా శిక్షణ అందించబడింది. కార్యక్రమంలో విభాగ్ పాఠశాల ప్రధానాచార్యులు, 160 మంది ఆచార్యులు, విద్యాపీఠం బాధ్యులు ప్రధానోద్యాయులు మోర రణధీర్ పాల్గొన్నారు.



## వర్షాభావ పరిస్థితులపై పంట మార్పిడి అవగాహన సదస్సు

**కురవి (ప్రజా తీర్పు విలేఖరి) జులై 10**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని లింగ్యా తండా (కె) గ్రామంలో శుక్రవారం నాడు కురవి మండల వ్యవసాయ అధికారి జి.నరసింహారావు ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు మరియు పంట మార్పిడి విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన మరియు పట్టు శాఖ అధికారి జినుగు మరియన్న మరిపెడ సహాయ వ్యవసాయ సంచాలకులు పన్మటీంటి మురళి హాజరై, ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అలాగే పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు, ఆదాయం పెరుగుతాయని వివరించారు. కురవి మండల వ్యవసాయ అధికారి గుంటక నరసింహారావు మాట్లాడుతూ...రైతులకు ప్రభుత్వ సూచనలు, శాఖ అందిస్తున్న సేవలు, వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి, లింగ్యా తండా గ్రామ సర్పంచ్ బాదావత్ కాంతి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణా, ఇరిగేషన్ ఏ డి కవిత, వీరన్న, రైతులు మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

## తల్లితండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు అండగా జనతా ట్రస్ట్

**నర్సంపేట జూలై 10 ప్రజా తీర్పు**



నర్సంపేట నియోజకవర్గం, చెన్నారావుపేట మండలం, గతా కొద్దీ రోజుల క్రితం ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకున్న పాపయ్యపేట గ్రామానికి చెందిన బుడిగే శిరీష రవికుమార్ దంపతుల కుటుంబాన్ని పరామర్శించి, శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండంగా ఉంటామని భరోసా ఇచ్చారు, మరణించినా దంపతుల కుమారులైన సుశాంత్, విద్వాన్ష్ లకు మనో ధైర్యాన్ని చెప్పి వారికీ 10,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన లిజనతా ట్రస్ట్ చైర్మన్ డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి లిజనతా ట్రస్ట్ సభ్యులు ఈ కార్యక్రమంలో దుంకదువ్వ రంజిత్, గూడూరు సందీప్, మురహరి విజయ్, అచ్చ దయాకర్, బానోత్ రమేష్, విజయ్ సింగ్, మరాఠి ఉప్పలయ్య, మేడి సంతోష్, మరియు కందల చంద్రమౌళి, మేడి వంశీ కృష్ణ, బండి రాజ్ కుమార్, పాల్తీయ శశీందర్, నరేష్, సుమన్, నవీన్ నారాయణ పాల్గొన్నారు...



## అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

- మెట్రో రైల్ పాసులను సైతం ఉచితంగా ఇవ్వాలి
- రైల్వే పాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలి
- ఈ నెల 13 న జరుగబోయే ఛలో కలెక్టరేట్ ను జయప్రదం చేయండి: టీడబ్ల్యూజేఎఫ్

**నర్సంపేట, జూలై 10, ప్రజా తీర్పు ప్రతినిధి:**

అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఆంక్షలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, మెట్రో రైల్ పాసులను ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు పోడేటి అశోక్, కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, జిల్లా కోశాధికారి గాయపు రాజురెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు అనంతుల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం అందుబాటులో ఉన్న ఆఫీస్ బేరర్స్ సమావేశం కాశిబుగ్గలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13 న జరుగబోయే ఛలో కలెక్టరేట్ కార్యక్రమానికి జర్నలిస్టులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రైల్వే పాసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని, జర్నలిస్టుల హెల్త్‌కార్డులతో అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలని కోరారు. ఆర్టీసీబస్సులతోపాటు మెట్రో రైల్ పాసులను సైతంఉచితంగాఇవ్వాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఈ20తో మైలేజ్ తగ్గొచ్చు

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి ఈ20 పేరుతో అమ్ముతున్న ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై దేశవ్యాప్తంగా వాహనదారుల నుంచి ప్రతిఘటన ఎదురవుతున్నది. ఇప్పటికే దీనిపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాహనదారుల ఆధ్వర్యంలో ధర్నా కూడా జరిగింది. ఈ సందర్భంగా దేశంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు కేంద్రం సమాధానమిచ్చింది.



## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 10(ప్రజాతీర్పు ):**

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల పారిశుధ్య నిర్వహణలో సర్పంచుల పాత్ర కీలకము

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 10(ప్రజాతీర్పు ):**

గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో సర్పంచ్ ల పాత్ర కీలకమని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సర్పంచ్ లకు గ్రామ పరిపాలన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకమని వివరించారు. ఇందుకోసం సర్పంచ్ లు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ అంశంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని వివరించారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ, ఆదాయ సృష్టి చేసుకోవచ్చని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అంకితభావంతో కృషి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట జిల్లా మేనేజర్ మేరుగు నరేష్ యాదవ్

**హుస్నాబాద్ జూలై 10 ప్రజా తీర్పు**



108 సిబ్బంది అత్యవసర సేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఆకస్మిక తనిఖీలలో భాగంగా హుస్నాబాద్ మండల కేంద్రంలో ఉన్నటు వంటి108, 102 అండ్ 1962 అత్యవసర సేవల అంబులెన్స్ లను తనిఖీ చేశారు. అంబులెన్సు లో ఉన్నటువంటి మెడికల్ ఎక్విప్మెంట్స్ మెడికల్ ఇండెంట్ ని పరిశీలన చేసి రికార్డులను చెక్ చేసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. హుస్నాబాద్ మండల ప్రజలందరికీ అత్యవసర సేవలను అందించాలని ఈ వర్షాకాలంలో వచ్చేటువంటి సీజనల్ వ్యాధుల గురించి సిబ్బందికి అవగాహన కల్పిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని తెలియ జేశారు. అదేవిధంగా అత్యవసర సేవలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతున్న టెక్నాలజీని ఉపయోగిస్తూ అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచనలు ఇచ్చారు. అత్యవసర సేవలలో ఎటువంటి అజాగ్రత్త వహించినా తగిన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ శ్రీనివాస్, విష్ణువర్ధన్, ఏ బి సి రాజు, పైలెట్లు జగన్, రవీందర్ రెడ్డి, సృజన్, శ్రీధర్ పాల్గొన్నారు.

# తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల ఎదుట నిరసన ప్రదర్శన
- తెలంగాణ వైద్య ఉద్యోగుల ఐక్యవేదిక

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జులై 10**




గార్ల. స్థానిక మండల కేంద్రం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం తెలంగాణ వైద్య విధాన పరిషత్. ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భైరపాకశ్రీనివాస్ మాట్లాడుతూడైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ (డి ఎస్ హెచ్) / తెలంగాణ వైద్య విధాన పరిషత్.లో గత 40 రోజుల కింద రిటైర్మెంట్ అయిన టీవీ విపి కమిషనర్ స్థానంలో ఎవరిని భర్తీ చేయని కారణం చేత పరిపాలనలో శూన్యత ఏర్పడి చాలా సమస్యలు పెండింగ్లో ఉన్నాయి.. ఈ పదవి బాధ్యతను ప్రిన్సిపల్ సెక్రటరీ కి ఇవ్వడం వలన వారు సమయాన్ని కేటాయించకపోవడం చేత అందులో పనిచేస్తున్న ఉద్యోగుల పరిపాలనా, సర్వీస్ సంబంధిత సమస్యలు పెండింగ్లో ఉన్నాయి ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ హాస్పిటల్స్ ముందు వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్ ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భైరపాక శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ కు పూర్తిస్థాయి రెగ్యులర్ కమిషనర్ ను వెంటనే నియమించాలి! పెండింగ్‌లో ఉన్న రీడిప్లాయ్‌మెంట్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలి. సాధారణ బదిలీల వల్ల ఏర్పడిన అన్ని పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించాలి. వైద్య రీయింబర్స్‌మెంట్ బిల్లులతో సహా అన్ని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలిఅన్ని అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రమోషన్ ప్రక్రియను పూర్తి చేయాలివివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి. కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని డి ఎస్ హెచ్/ టీవీ విపిఆసుపత్రులకు తగిన కేడర్ బలాన్ని మంజూరు చేయాలి. పెండింగ్‌లో ఉన్న అన్ని అధికారిక చర్యలను పూర్తి చేసి, సర్వీస్ రిజిస్టర్లను సంబంధిత ఆసుపత్రులకు వెంటనే పంపించాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ముందుగానే జారీ చేసి, వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలి. ఈ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ ( టీవీ విపి) / డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ( డి ఎస్ హెచ్) పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ముందు ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో తమ ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించడం ద్వారా వారి మనోధైర్యం పెరగడంతో పాటు పరిపాలనా సామర్థ్యం మెరుగుపడి, ప్రభుత్వ వైద్య సేవల నాణ్యత మరింత పెరుగుతుందని ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలనివిజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో . భైరపాక శ్రీనివాస్ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ కే శ్రీధర్ గౌడ్ డాక్టర్ కృష్ణవేణి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ కే స్వాతి ఐ రాణి, నర్సింగ్ ఆఫీసర్స్ ఆశాలత, వెంకటరమణ, పీ స్పందన, కే స్వాతి, ఏఎన్ఎమ్స్ యాక లక్ష్మి, లత, ల్యాబ్ టెక్నీషియన్ తిరుమల రావు, ఫార్మసిస్ట్ పర్వీన్ ఎక్సరే టెక్నీషియన్ అశోక్, ఆరోగ్య మిత్ర షకీరా, మల్లికాంబ , పేషంట్ కేర్ షాహిన్, జాన్ బి, శానిటేషన్ సిబ్బంది దేవరాజ్, సింధు, విజయలక్ష్మి, ఉమా, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు




# ఆధునిక విద్యా బోధనలు అలవర్చుకోవాలి

- ఆడిషినల్ కలెక్టర్ బి. ఎస్. లత.

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 10.**

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ ఉపయోగించుకొని ఉపాధ్యాయులు ఉత్తమమైనటువంటి విద్యార్థులను ఉత్తమ ఫలితాలు దిశగా బోధన జరపాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లతా అన్నారు స్థానిక ఓల్డ్ హైస్కూల్ జగిత్యాలలో గత మూడు రోజులుగా నడుస్తున్న జిల్లాస్థాయి ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల నుండి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్చినందుకు ఉపాధ్యాయులను వారు అభినందించారు మూసి వేయబడిన పాఠశాలలను పున ప్రారంభించినందుకు అభినందించారు తరగతి గది బోధనతోపాటు ఐఐటి ఫౌండేషన్ పిల్లలను పెంపొందించేలా బోధనలు జరపాలని దీనికి ఖాన్ అకాడమీ మరియు శిక్ష కో పైలట్ తెలంగాణ డాట్ కం వెబ్సైట్ ద్వారా పాఠ్యప్రణాలు రూపొందించడం విద్యార్థులకు ప్రశ్నాపత్రం మరియు అసైన్మెంట్ ఇస్తూ వారిని నిష్ణాతులు గా తయారుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ అధికారి చంద్రశేఖర్ రెడ్డి రిసోర్స్ పర్సన్స్ పరమేశ్వర్ రాజ్ కుమార్ జగదీశ్వర్ లక్ష్మణ్ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు బోయిని పెల్లి ఆనంద్ రావు పూటూరి హరీష్ తపస్సు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వీర్లమల వెంకట్ రమణారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్ విజయవంతం

- కొలపురి ఆశిక్

**రామడుగు, జూలై 10 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ రామడుగు మండల ఉపాధ్యక్షుడు కొలపురి ఆశిక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బంద్‌కు విద్యార్థులు విశేషంగా సహకరించారని, పలు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్య హక్కును కాపాడేందుకు, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ బంద్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# రాంపురం సబ్ సెంటర్లో వైద్య ఆరోగ్య శిబిరం

- పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలి
- డాక్టర్ హనుమంతరావు

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి ( జూలై 10**

గార్ల.. స్థానిక మండల పరిధి ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రాంపురం సబ్ సెంటర్ కొత్త తండాలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు ఈహెల్త్ క్యాంపునకు వచ్చిన 25 మంది పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ హనుమంతరావు రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు కలరా టైఫాయిడ్ మలేరియా తదితర వ్యాప్తి చెందకుండా ప్రజలు నీటిని వేడిచేసి చల్లార్చిన నీటినే త్రాగాలి, పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పరిసరాలని పరి శుభ్రంగా ఉంచుకోవాలని మురికి నీరు నిలువ ఉంచకుండా చూసుకోవాలని అన్నారు అనంతరం పులిగుట్ట తండ నుండి వచ్చిన ఇద్దరు గర్భనీలను పరీక్షించి సుఖ ప్రసవంకోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు, ప్రభుత్వ ఆసుపత్రులను ప్రసవాలకు సక్రమంగా చదివేగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు రోగగ్రస్తులు తదితరులు పాల్గొన్నారు

# విద్యారంగాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్

**మంథని, జూలై-10 (ప్రజాతీర్పు)**




రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన విద్యాసంస్థల బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం మంథని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం తగిన నిధులు పెంచి, అక్షయపాత్ర, ఇస్కాన్, మున్నా వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించి వారితోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు జీవో నంబర్లు 7, 8, 9 లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయ కేంద్రాలను వెంటనే మూసివేయాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేసి అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. అలాగే అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల, హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజ్ కుమార్, నాయకులు తిరుపతి, రాకేష్, అవినాష్, సాయి, సుమన్ పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

- పేదవాడి సొంతఇంటి కలను నెరవేర్చటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జులై 10**

టేకులపల్లి :ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య దాసుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సింగ్యతండా, లచ్చ తండా గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం మరియు శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లచ్చ తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ కరుణ -- బిచ్చు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సింగ్య తండా చెందిన నునావత్ లచ్చిరాం -- మమతా దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ భూక్యా చందర్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్. , జిల్లా ప్రధాన కార్యదర్శి లికాలే ప్రసాద్ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, బానోత్ రమేష్, వాంకుడోత్ పుణ్యా, లక్ష్మయ్య,పోశాలు,లకావత్ లాలు, భూక్యా ఈశ్వర్, ఇస్లావత్ గణేష్, శేఖర్, శ్రీకాంత్, సర్దార్, బానోత్ రవి, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జులై 10**



జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా ధర్మపురి పట్టణానికి చెందిన బిజెపి నాయకులు పోగుల గుండయ్య మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పోగుల గుండయ్య కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10,000లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అవకాశం

**(దుర్గం నగేష్ , ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 10**




తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని టీజీఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా 2026--27 సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్) పరీక్షలకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత కోచింగ్ అందించనున్నట్లు కరీంనగర్ ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకోసం అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని తెలిపారు. ప్రవేశానికి జూలై 29న ఆబ్జెక్టివ్ విధానంలో ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షలో పార్ట్--ఏ (జనరల్ స్టడీస్)కు 200 మార్కులు, పార్ట్--బీ (సీఎస్ఏటీ)కు 100 మార్కులు ఉంటాయని వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు జూలై 19 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ స్టడీ సర్కిళ్లలో 2, 3 లేదా 5 నెలల ఉచిత శిక్షణ పొందిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 1980 నుంచి టీజీఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఇప్పటివరకు 437 మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారని తెలిపారు. వీరిలో 52 మంది ఐఏఎస్, 56 మంది ఐపీఎస్, ఇద్దరు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు, 327 మంది ఇతర కేంద్ర సర్వీసుల్లో ఎంపికైనట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 040-23546552, 8121626423 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని, ⌈ంంఎంఎవఇఖఎంఏస్త్రఖిఅశ్రీ.ఏశీఎకు ఈమెయిల్ చేయవచ్చని సూచించారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కోరారు. సమావేశంలో వెన్న రాజా మల్లయ్య పాల్గొన్నారు.

# 34,500 రూపాయలు ఆర్థిక సహాయం చెసిన 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్


**(నారు కట్ల మధు ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జులై 10**



వేములవాడ మండలం నాంపల్లి గ్రామం ఇస్లాం నగర్ సమీపంలో రెండు రోజుల క్రితం జరిగిన ఆక్సిడెంట్ లో మొత్తం 23 మంది గాయపడ్డారు. ఇందులో 3 మరణించారు. వీరిలో 7 మందికి వేములవాడ ఏరియా ఆసుపత్రి లో, 10 మందికి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స అందిస్తున్నారు. వారు రోజు వారి కూలి పనులు చేసుకుని బతికేటోళ్ళు నిరు పేద వారు కావడం తో ఈ విషయం తెలుసుకున్న 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వేములవాడ ఏరియా ఆసుపత్రి కి వెళ్లి 7 మందికి ఒక్కొక్కరికి 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు అలాగే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లి 10 మందికి ఒక్కొక్కరికి 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు మరణించిన ముగ్గురు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 3,000 రూపాయలు ఇచ్చారు ఇట్టి కార్యక్రమం లో 98 ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తిప్పర్తి రాజేష్ గారు, వేములవాడ 25 వార్డ్ కౌన్సిలర్ కొక్కుల బాలరాజు గారు, ఎతీం నాయకులు నీలం శేఖర్ గారు, హింగే శివం గారు, బాయి సుమన్ శర్మ గారు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా పెయింటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 10**



పెద్దపల్లి జిల్లా పెయింటర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్లెపల్లి రవి హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాంసాని నర్సయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కార్యవర్గ సభ్యులు, గౌరవ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి సభ్యుడికి అందుబాటులో ఉంటూ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా మంద భాస్కర్ యాదవ్, అధ్యక్షుడిగా నాంసాని నర్సయ్య, ఉపాధ్యక్షులుగా దాదాల దేవి, అంకోలు వీరేష్, బండారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మినుముల సైదులు, కోశాధికారులుగా చంద్రగిరి సుమన్, పల్లె విజయ్, సలహాదారులుగా మెంగన్ నాగేష్, తౌడెం ప్రసాద్, గడ్డం శంకర్, ఆర్గనైజర్‌గా శనగారపు నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా గరిగంటి రాజేందర్, మహ్మద్ తాహెర్ తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలని నిర్ణయించారు.

# కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది

- నేడు ఇవ్వకుండా 420 పార్టీ గా మారింది..
- కాంగ్రెస్ కౌంట్ డౌన్ స్టార్ట్
- కరీంనగర్ అబివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 10**



కాంగ్రెస్ సర్కార్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని, ఆచరణ సాధ్యం కానీ 6 గ్యారంటీలు,420 హామీలతో ప్రజానీకాన్ని దగా చేసిన ఆ పార్టీనీ గద్దె దించే వరకు పోరాటం ఆపేది లేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ ఇంచార్జి శాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా బిజెపి విస్తృత సాయి సమావేశం శుక్రవారం గంగాధర మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ముఖ్య అతిథి శాంతి కుమార్ లు మాట్లాడుతూ కేంద్రం లోని మోడీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే కరీంనగర్ దిశా దశ మారిందని , ముఖచిత్రం మారుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ కీలక తీర్మానాలను ప్రవేశపెట్టారు. అదే సమయంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జిల్లాకు అందిస్తున్న అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ ఆరోపించింది. హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ నీ'420 పార్టీగా అభివర్ణించింది. రుణమాఫీలో స్పష్టత లేకపోవడం, రైతు భరోసా జాప్యం, నిరుద్యోగ భృతిని విస్మరించడం, మహిళలకు ఇచ్చిన హామీలపై మాట తప్పడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో ఇసుకమాఫియా రాజ్యమేలుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోద్బలంతోనే సామాన్యుడికి ఇసుక అందకుండా దోపిడీ జరుగుతోందని మండిపడ్డారు. వర్షాభావ పరిస్థితుల దృశ్య తాగు నీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆయా డిక్లరేషన్లను అటకెక్కించిందని ఘాటుగా విమర్శించారు.ఎస్టి ఎస్సీ బీసీ సామాజిక వర్గాల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. బి.ఆర్.ఎస్ - కాంగ్రెస్ దొందూ దొం దేనని ,గత బిఆర్ఎస్ పాలన మాదిరే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందని, ఈ రెండు పార్టీల తీరు ఒక్కటేనని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**మోదీ 'వికసిత్ భారత్' కు మద్దతు.**

ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన , అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్టను పెంచిన విధానాన్ని సమావేశం కొనియాడింది. కరీంనగర్ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కృషి,ప్రత్యేక చొరవతో కరీంనగర్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ,ముఖ్యంగా జగిత్యాల-కరీంనగర్, కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారులు, సిఆర్ఎఫ్ ఫండ్స్ వినియోగం, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్మెంట్ ఫండ్ ,గ్రామాల్లో ఈజీఎస్ నిధుల ద్వారా మారుతున్న జిల్లా ముఖచిత్రంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అదే సమయంలో కేంద్ర పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో జిల్లాను ముందుంచేందుకు కృషి చేస్తామని కరీంనగర్ జిల్లా బీజేపీ శాఖ స్పష్టం చేసింది. బిజెపి జిల్లా శాఖ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ, రాష్ట్ర అధికార ప్రతినిధి , డిప్యూటీ మేయర్ సునీల్ రావు బలపరిచి మాట్లాడారు.. అనంతరం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యకులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి వ్యవసాయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఈ తీర్మానాన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్ , జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ బలపరచి. మాట్లాడారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఘాటుగా విమర్శించారు. కరీంనగర్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితో కేంద్ర ప్రభుత్వం నిధులు తోనే జరుగుతుందన్నారు. కింది స్థాయిలోనాయకులు కార్యకర్తలు అందరం కష్టపడి పని చేయాలని , రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, మాజీ ఎంపీపీ , కార్పొరేటర్ వాసాల రమేష్ , రాష్ట్ర నాయకులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి , లతో పాటు అపేక్షిత రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు , వివిధ మోర్చా బాధ్యులు పాల్గొన్నారు.



## సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**నర్సంపేట, జూలై 10, ప్రజా తీర్పు ప్రతినిధి:**

గ్రామపంచాయతీలలో సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళిక (ఙూణా)ను సమర్థవంతంగా రూపొందించి అమలు చేయడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేటలో సిటిజన్ క్లబ్ లో శుక్రవారం గ్రామపంచాయతీ--సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుతం సమగ్ర ఓటరు ఇంటింటి సర్వే లో సర్పంచ్ లు ముందుగా మీరు ఓటరు ఫారం నమోదు చేసి డిజిటలైజేషన్ చేయించుకోవాలని ,తద్వారా ప్రజల సందేహాలను కూడా నివృత్తి చేయగలరని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు రానున్న వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సూచనలు పాటిస్తూ పంట మార్పిడి పంటలు వేయాలని, నీటి తక్కువ వినియోగం తో పండించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భూగర్భ జలాలను ఇంకిపోకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను నిర్వహించి, పారదర్శకంగా ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి,జడ్పి సీఈఓ రామ్ రెడ్డి,నర్సంపేట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శృతి హర్షిత, ఆర్డీవో ఉమా రాణి, డిఆర్డిఓ నాగ పద్మజ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను మరో రెండు నెలలు పొడిగించాలి

- ఇప్పటికీ 40 శాతం మాత్రమే పూర్తయింది
- ఎన్యుమరేషన్ ఫారాలను ప్రతి ఇంటికి అందజేసేలా చూడాలి
- ఎంఐఎం నేత గులాం అహ్మద్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 10**

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి కావడం కోసం మరో రెండు నెలల సమయాన్ని పొడిగించాలని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఎన్నికల సంఘానికి జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో హెల్ప్ డెస్క్ ద్వారా పార్టీ వాలంటీర్లు, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బిఎల్వోలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఆన్లైన్లో, ఆఫ్ లైన్లో నింపే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూశుక్రవారం ఎంఐఎం కార్యాలయానికి సెలవు రోజు అయినప్పటికీ పలు డివిజన్ల ప్రజలు ఎన్యుమరేషన్ ఫారాలను నింపే ప్రక్రియను కొనసాగించాలని తమ దృష్టికి తీసుకురాగా, ప్రజల విజ్ఞప్తి మేరకు శుక్రవారం సైతం ఎన్యూమరేషన్ ఫారాలను, ఎంఐఎం పార్టీ ద్వారా జిరాక్స్ కాపీలను ఉచితంగా అందజేసి ఆన్లైన్లో, ఆఫ్ లైన్ లో ఫారాలను నింపే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్యుమరేషన్ ఫారాలను ఫిలప్ చేసేందుకు ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, వాలంటీర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. కరీంనగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికి 40 శాతం మాత్రమే పూర్తయిందని, పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్ ఫారాలను భర్తీ చేసే ప్రక్రియ ఆఫ్లైన్, ఆన్లైన్ పూర్తి కావాలంటే మరో రెండు నెలల సమయం పడుతుందన్నారు. బిఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికి తిరిగి పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారని, ఇంటి అడ్రస్ లు తెలియక, ఓటర్ ఐడి లో ఉన్న ఫోన్ నెంబర్లు పనిచేయక ఇబ్బందులకు గురవుతున్నారని, ఎన్నికల సంఘం ఇచ్చిన నెల సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి కావడం కష్టమని చెప్పారు. ఓవైపు ప్రజలు, మరోవైపు బిఎల్వోలు ఎస్ఐఆర్ ప్రక్రియపై అనేక సందేహాలు, నివృత్తి కాకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చాలాచోట్ల ఎన్యుమరేషన్ ఫారాలు నింపేందుకు సరైన గైడింగ్ చేసే వాళ్లు లేక తప్పుగా ఎన్యుమరేషన్ ఫారాలు నింపుతున్నారని, ఇదంతా సరిచేసి పూర్తి కావాలంటే ఖచ్చితంగా టైం పొడిగించాలని ఎన్నికల సంఘానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. మహిళల కోసం శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ కార్యక్రమంలో 60వ డివిజన్ కార్పొరేటర్ నసీం సుల్తాన ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్ రాఫియ సుల్తాన, మాజీ కోఆప్షన్ సభ్యురాలు ముంతాజ్ బేగం బాబుజానీ వాలంటీర్లు అబ్దుల్లా ఖాన్ షేక్ రెహన్ యునూస్ అల్మాస్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

- వారెంట్లు ఉన్నవారు కూడా భయపడకుండా ముందుకు రావాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

**(దుర్గం నగేష్, ప్రజాతీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 10**



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు జూలై 18న నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల ప్రజలకు సూచించారు. శుక్రవారం రంగంపల్లిలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 1,659 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉండగా, 476 కేసుల్లో వారెంట్లు జారీ అయ్యాయని తెలిపారు. వారెంట్లు ఉన్నవారు కూడా భయపడకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఇరువర్గాల అంగీకారంతో కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఒకేసారి మొత్తం మొత్తాన్ని చెల్లించలేని వారికి విడతల వారీగా చెల్లించే వెసులుబాటు కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు సంబంధిత బ్యాంకు అధికారులతో చర్చించి రాజీకి రావచ్చని, అవసరమైన చోట రాయితీలు పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకుతో పాటు పలు చిట్‌ఫండ్ సంస్థలకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసులను కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వివరించారు. జిల్లాలోని న్యాయవాదులు తమ క్లయింట్లకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి సహకరించాలని ఆమె కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కోర్టు వ్యయాలు, సమయాన్ని ఆదా చేసుకుంటూ తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే తాటతీస్తా

### 40 ట్రాక్టర్ల ఇసుకడంపులు సీజ్, కేసు నమోదు

**హుస్నాబాద్ జులై 1 0 ప్రజా తీర్పు**



అక్రమంగా ఇసుక తరలిస్తే తాట తీస్తానని చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ హెచ్చరించారు. చిరుమామిడి మండలంలో గల రామంచ ,ఉల్లంపల్లి, అంటుకలపల్లి గ్రామాలలో నాలుగు చోట్ల అక్రమంగా ఇసుక తరలించి నిల్వ ఉంచిన ఇసుక డంపులను సీజ్ చేశారు. సుమారు 40 ట్రాక్టర్ల లోడుల ఇసుక పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని,కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.అలాగే ఉల్లంపల్లి లోఅక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు.



## ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరైన మోకుదెబ్బ రమేష్ గౌడ్

**నర్సంపేట జూలై 10 ప్రజా తీర్పు**

నర్సంపేట పట్టణానికి చెందిన గౌడ సంఘం నాయకులు నాళంవిజయ విజయ్ కుమార్ గౌడ్ దంపతులకు చెందిన కుమారుడు డాక్టర్ మణి గౌడ్ ఎంగేజ్మెంట్ కార్యక్రమం హనుమకొండ హంటర్ రోడ్డు లోని గౌడ హాస్టల్ లో జరిగింది.ఈ కార్య క్రమానికి గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంతుల రమేష్ గౌడ్ హాజరై కాబోయే నూతన వదూ వరు లను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనం సాక్షి జర్నలిస్ట్ కోల రాజేందర్ గౌడ్, మోకు దెబ్బ హన్మకొండ జిల్లా కార్యదర్శి తోటకూరి రాందాస్ గౌడ్, రాష్ట్ర నాయకులు సొల్తీ సార య్య గౌడ్, నాయకులు వెంకటేశ్వ ర్లు గౌడ్, బోడిగె ప్రవీణ్ గౌడ్,బూర్గు రవీందర్ గౌడ్, సాంబయ్య గౌడ్ పాల్గొన్నారు.

## రేపు ఘనంగా జమ్మికుంట ఆర్యవైశ్య పట్టణ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం

- పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్.

**జమ్మికుంట జూలై 10 ప్రజాతీర్పు**



స్థానిక ఆర్యవైశ్య పట్టణ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని రేపు (ఆదివారం, జూలై 12వ తేదీన) అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని "సువర్ణ ఫంక్షన్ హాల్" లో ఉదయం 10:00 గంటలకు ఈ ప్రమాణస్వీకార మహోత్సవం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు కన్నె కృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. వారితో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని సంఘం ముఖ్య నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, పెద్దలు ఈ వేడుకకు హాజరుకానున్నారు. జమ్మికుంట పట్టణ వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య సంఘాల బలోపేతానికి, భవిష్యత్ కార్యాచరణకు ఈ నూతన కమిటీ ఎంతో కీలకంగా పనిచేస్తుందని శరత్ కుమార్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణ పరిధిలోని వైశ్య కుటుంబీకులు, పెద్దలు, మహిళలు, యువతీయువకులు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఆర్యవైశ్యులంతా ఒకేతాటిపైకి వచ్చి, కుటుంబసమేతంగా తరలివచ్చి నూతన కమిటీని ఆశీర్వదించాలని, అలాగే ఈ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయవలసిందిగా లెంకలపల్లి శరత్ కుమార్ తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 10 :**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో ట్రాక్టర్ డీకొని సుల్తానాబాద్ మండలం మడక గ్రామానికి చెందిన నూనె రాజు (45 ) మృతి చెందాడు. వెల్గటూర్ ఇంచార్జి ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారంగా మృతుడు వెల్గటూర్ నుండి ధర్మారం కు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎండపల్లి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఆరెల్లి ఈశ్వర్ తన ట్రాక్టర్ ని అతివేగంగా, ఆజాగ్రతగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న నూనె రాజు కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కూతురు పెసరి శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జి ఎస్సై రవీందర్ వెల్లడించారు.

# రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్, జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీసుల ఉత్తమ ప్రతిభ

- క్రీడాకారులను,పోలీస్ అధికారులను , సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**(నారుకట్ల మధు ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జులై 10**



మల్కాజిగిరి కమిషనరేట్ వేదికగా జులై 07 నుండి 09 తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 5 వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 03 పతకాలు ( యోగ లో రిజర్వ్ కానిస్టేబుల్ దేవారాజ్ గోల్డ్ మెడల్, అర్చ్ఛ రెజిలింగ్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్ బ్రాంజ్ మెడల్, పవార్ లిఫ్టింగ్ లో ఆర్మడ్ కానిస్టేబుల్ సంతోష్ సిల్వర్) సాధించడం పట్ల జిల్లా ఎస్పీ సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కరీంనగర్ వేదిక జరిగిన జోనల్ స్థాయి డ్యూటీ మీట్ లో వివిధ క్యాటగిరీలలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ( సిరిసిల్ల రూరల్ సి.ఐ నాగేశ్వరరావు, బోయినపల్లి ఎస్.ఐ రమాకాంత్, వీర్నపల్లి ఎస్.ఐ లక్ష్మణ్, వేములవాడ రూరల్ కానిస్టేబుల్ రాజశేఖర్,ఏ ఆర్ కానిస్టేబుళ్ళు హరీష్, కిరణ్ లను అభినందించారు. ఈసందర్భంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతలకు పతకాలు అందజేసి అధికారులను,సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ తెలిపారు. గెలుపోటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలన్నారు.ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా తమలోపాలను సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ సిరిసిల్ల రూరల్ నాగేశ్వరరావు, ఆర్.ఐ అడ్మిన్ సురేష్, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.



## గణితం ద్వారా సులువైన పరిష్కారాలు

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో వివరించిన ఐఐటీ బాంబే ఆచార్యుడు ప్రొఫెసర్ శివాజీ గణేష్

**పటాన్ చేరు జూలై 10 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

ఒక ఆలోచన, మూడు సమస్యలు, ఒక పద్ధతి' అనే సూత్రం ద్వారా మనకు ఎదురయ్యే సవాళ్లకు గణిత శాస్త్రం ద్వారా పరిష్కారాలను చూపొచ్చని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బొంబాయికి చెందిన ప్రొఫెసర్ శివాజీ గణేష్ అన్నారు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'పాక్షిక అవకలన సమీకరణాలు (పీడీఎఫ్ లు), వైవిధ్య విశ్లేషణ' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత, గణాంక శాస్త్ర విభాగం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన వైవిధ్య విశ్లేషణ పునాదులను సదస్యులకు పరిచయం చేశారు. ఒక అంతరంలోని ప్రమేయాల నుంచి డైరిక్లెట్ సూత్రం వరకు గల ప్రయాణాన్ని వివరించారు. వైవిధ్యాల కలన శాస్త్రంలో ప్రత్యక్ష పద్ధతిని ఉపయోగించి కనిష్ఠీకరణల ఉనికిని వెల్లడించారు. ఒక సంవృత అంతరంలో అవిచ్ఛిన్న ప్రమేయం(=గీఅ)లో రేఖీయ వ్యవస్థ, ప్రమేయ అంతరాళంలో ఒక సరిహద్దు విలువ సమస్య -- అనే వేర్వేరుగా కనిపించే మూడు గణిత సమస్యలను, ఒక శక్తి ప్రమేయాన్ని కనిష్ఠీకరించే భావన ద్వారా ఎలా ఏకీకృతం చేయవచ్చో ప్రొఫెసర్ శివాజీ ప్రదర్శించారు. సమీకరణాలను నేరుగా పరిష్కరించడం ద్వారా కాకుండా, ప్రత్యక్ష పద్ధతిని (డైరెక్ట్ మెథడ్) ఉపయోగించడం ద్వారా పరిష్కారాల ఉనికిని స్థాపించవచ్చని ఆయన వివరించారు. ఈ ప్రత్యక్ష పద్ధతిలో, ఒక కనిష్ఠీకరణ క్రమాన్ని నిర్మించడం, ఒక అభిసరణ ఉపక్రమాన్ని సంగ్రహించడం, విరామం తీసుకోవడం వంటివి ఉంటాయన్నారు. గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, ప్రొఫెసర్ బి.ఎం.నాయుడు, డాక్టర్ శివారెడ్డి శేరిల సమక్షంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ మోతెహర్ రెజా అతిథిని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సమన్వయం చేశారు.



## విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి సరికాదు

- ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం
- ఏ ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్తా నాగరాజు

**నర్సంపేట జూలై 10 ప్రజా తీర్పు**

విద్యార్థుల సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నల్లబెల్లిలో శాంతియుతంగా నిరసన తెలిపినందుకు పోలీసులు తనను ముందస్తుగా అరెస్ట్ చేశారని ఐ ఎఫ్ డి ఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్తా నాగరాజులి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై పూర్తిగా మొండి వైఖరి అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో సరిపడా లెక్చర్లు లేకపోవడం, హాస్టల్స్ లో కనీస సౌకర్యాలు కరువు, 12000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ లో ఉండటం వంటి తీవ్రమైన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయించడం, ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కంటే కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై మరింత దమనీతి విధానాలు అనుసరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే తన మొండి వైఖరిని విడనాడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ ఈ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా కలిసి పోరాడాలని మార్తా నాగరాజు పిలుపునిచ్చారు.



## బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- కారుణ్య నియామక పత్రాలు అందజేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రెవెన్యూ శాఖలో ముగ్గురికి ఉద్యోగ అవకాశం
- నియామక పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 10**

విధి నిర్వహణలో ఉండగా మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన ముగ్గురు అభ్యర్థులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

**బాధిత కుటుంబాల్లో వెలుగులు**

చనిపోయిన ఉద్యోగుల వారసులకు అర్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేట్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న వారికి ఈ ఉద్యోగాల ద్వారా భరోసా లభిస్తుందని ఆకాంక్షించారు. బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అభ్యర్థులకు సూచించారు. ఉద్యోగ అవకాశం కల్పించినందుకు లబ్ధిదారులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ బాధ్యత

- "ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- చల్లూర్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

**జమ్మికుంట, జూలై 10 ప్రజాతీర్పు**



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని హుజురాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని చల్లూర్ గ్రామంలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల, స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలోని విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల బోధనా విధానం, తరగతి గదుల నిర్వహణను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం నాణ్యత, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పరిస్థితులు, పాఠశాలలోని మౌలిక వసతులపై ప్రత్యేక నిఘా పెట్టారు. అనంతరం ఆయన విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారి చదువుల తీరును, పాఠశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే.. చిన్నారుల నమోదు వివరాలను, వారికి అందుతున్న పోషకాహార నాణ్యతను, కేంద్రం నిర్వహణ తీరును తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో వెల్లడైన పలు సమస్యలపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, గుర్తించిన లోపాలను వెంటనే నివారించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేలా నిరంతర పర్యవేక్షణ మరియు ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## అమీన్పూర్ మండల ప్రజలు స్వచ్ఛందంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలి

- బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్

**పటాన్ చేరు జూలై 10 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ మండలంలోని పటేల్గూడ, కిష్టారెడ్డిపేట్ తదితర గ్రామాలు, కాలనీలకు సంబంధించిన బూత్ లెవల్ అధికారులు ( బి ఎల్ ఓ )తో సమావేశమై ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ప్రజల స్పందనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో మాట్లాడిన ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, అమీన్పూర్, బీరంగూడ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల, కాలనీల ప్రజలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును స్థానికంగానే నమోదు చేసుకోవడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే సమయంలో కొందరు తమ స్వగ్రామాల్లోనే ఓటు కొనసాగించాలని కోరుతున్న విషయాన్ని కూడా బీఎల్ఓలు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అమీన్పూర్ మండలంలో సొంత ఇల్లు కలిగి ఇక్కడే శాశ్వతంగా నివసిస్తున్న ప్రతి కుటుంబం తప్పనిసరిగా తమ ఓటు హక్కును ఇక్కడే నమోదు చేసుకోవాలి ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు. మీరు నివసిస్తున్న ప్రాంతంలోనే ఓటు ఉంటే ఆ ప్రాంత అభివృద్ధిలో మీ భాగస్వామ్యం మరింత బలపడుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా మీ సమస్యలపై మరింత బాధ్యతతో స్పందించే అవకాశం ఉంటుంది అని పేర్కొన్నారు. అమీన్పూర్, బీరంగూడ డివిజన్లలో వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కూడా అంతే అవసరం. అందుకే సొంత ఇల్లు కలిగిన ప్రతి ఒక్కరూ ఇక్కడే ఓటు నమోదు చేసుకుని ఈ ప్రాంత భవిష్యత్ అభివృద్ధికి తోడ్పడాలి" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారతీయ జనతా పార్టీ ప్రజల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రతి కుటుంబ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం పనిచేస్తోందని అని అన్నారు అదేవిధంగా అమీన్పూర్ మండలంలో భారతీయ జనతా పార్టీ బిఎల్ఏ టూ లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత ప్రజలకు అన్ని విధాలుగా సహకరిస్తారని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. అలాగే మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు అమీన్పూర్, పటాన్చెరు ప్రాంత అభివృద్ధి కోసం పార్లమెంట్ స్థాయిలో నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటున్నారని కొనియాడారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి కూడా ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. చివరగా, "భారతీయ జనతా పార్టీ తరఫున అమీన్పూర్ మండలం, బీరంగూడ డివిజన్, అమీన్పూర్ డివిజన్ పరిధిలో సొంత ఇల్లు కలిగి నివసిస్తున్న ప్రతి కుటుంబం తప్పనిసరిగా తమ ఓటు హక్కును ఇక్కడే నమోదు చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాము. ప్రజల భాగస్వామ్యంతోనే అమీన్పూర్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది" అని ఈర్ల రాజు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈర్ల రాజు ముదిరాజ్ అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షులు.



## ఘనంగా స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు 74వ జయంతి వేడుకలు

**కూకట్పల్లి, జూన్ 10(ప్రజాతీర్పు)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు 74వ జయంతి సందర్భంగా కూకట్పల్లి వివేకానంద నగర్ కాలనీలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వారి కుమారుడు, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వివేకానంద నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వీ.ఎన్.ఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొని, తన తండ్రి స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వీఎన్ఆర్ వి.ఆర్.ఆర్ అభిమానులకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, "స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ప్రజాసేవనే పరమావధిగా భావించి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత. యువత సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని ఆయన చూపిన మార్గంలో నడవాలి. వారి సేవలు, విలువలు మరియు ఆదర్శాలు చిరస్థాయిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కాలనీ ప్రముఖులు, అభిమానులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు కి ఘన నివాళులు అర్పించారు.

## ఘనంగా జాతీయ మత్స్యకారుల దినోత్సవం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న గంగపుత్రులు

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 10**



మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం దగ్గర జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పునస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు చేసుకోవడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు : నేన్నెల నరసయ్య పట్టణ అధ్యక్షులు: గుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్న మత్స్యకారుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో అత్యంత వెనుకబడిన కులం గంగపుత్రులే దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గంగపుత్రులకు ఒరగబెట్టింది ఏమీ లేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని గత 12 సంవత్సరాల నుండి మరణించిన 986 మందికి ఎక్స్ గ్రేసియా తక్షణమే చెల్లించాలి అర్హులైన మత్స్యకారులు అందరికీ టూవీలర్లు ఫోర్ వీలర్ వాహనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలి మత్స్యకార సొసైటీ సభ్యులందరికీ జీవిత భద్రత కల్పించేలా 20 లక్షల ఇన్సూరెన్స్ ఎక్స్ గ్రేషియా అమలు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. పట్టణ యూత్ అధ్యక్షులు మంచెర్ల సదానందం శాఖపురం భీమ్సేన్. గగ్గూరి రాజన్న. మనోహర్,రాజన్న పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచుకోవాలి
- గ్రామ పంచాయతీ – సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 10**




గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం, కలెక్టరేట్ సమావేశ మందిరంలో హుజూర్నగర్, సూర్యాపేటకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి**

ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత**

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలను ప్రతి గ్రామ పంచాయతీ గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి గ్రామ పంచాయతీ--సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (+ూణ్యూ) ను రూపొందించుకోవాలని సూచించారు. ప్రణాళిక తయారీలో ప్రధానంగా ఏడు అంశాలపై వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించుకోవాలని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. ఇంటి వద్దనే చెత్తను వేరు చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితరాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో పారవేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద మరుగువదొడ్లు , సామజిక ఇంకుడు గుంటలు , కమ్యూనిటీ సానిటరీ కంప్లీక్స్ మరియు ప్లాస్టిక్ వేస్ట్ మానేజ్మెంట్ యూనిట్స్ నిర్మించాలని సూచించారు. జీ రామ్ జీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ సన్యాసయ్య , డీపీఓ యాదగిరి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకే చోట నిర్మాణం

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 10**



రాష్ట్ర చరిత్రలో ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల మోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హుజూర్నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసినదని, తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల , కృషి, ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం అని, దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు, ఈ రోజుమోడల్ కాలనీలో రూ.20 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ లకు శంఖుస్థాపనలు చేసుకోవడం జరిగినదని. ఇందులో 10 కోట్లతో 32 వేల స్క్వేర్ ఫీట్ సైజ్ లో తెలంగాణ మోడల్ పబ్లిక్ బోర్డింగ్ స్కూల్ నిర్మాణం చేసుకోవడం జరుగుతుందని , ఇందులో 2,500 మంది హౌసింగ్ కాలనీ, హుజూర్నగర్ లోకల్ పేద విద్యార్థులు చదువుకోడానికి వీలుంటుందని పూర్తిగా ఇంగ్లీష్ మీడియం లోనే విద్యాభ్యాసం ఉంటుందని, మిగతా 10 కోట్లతో అంగన్ వాడి భవనం, కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, డ్రైన్స్ , వీధి లైట్లు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని మంత్రి అన్నారు. కాలనీలో ఇంకా గ్రీనరీ పెంచాలని అలాగే జిల్లాలోని హౌసింగ్ సిబ్బందితో ప్రతి ప్లాటు క్షుణ్ణంగా చెక్ చేసి, అన్ని పనులు పూర్తి అయినవో, ఇంకా ఏమైనా పెండింగ్లో ఉన్నాయో నివేదిక అందించాలని కలెక్టర్ కు సూచించారు. అలాగే ఒకే ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన ఇద్దరు పిల్లలు ఉంటే వారికి అదనంగా ఇంకో ప్లాటు మంజూరు చేయాలని, బాత్రూం, టాయిలెట్స్ చిన్నవిగా ఉన్నందువలన ఎవరైనా అతిథులు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది కావున కాలనీలో బయట వైపు అదనంగా టాయిలెట్స్, బాత్రూమ్స్ మున్సిపాలిటీ వారితో నిర్మించి, వారికే మెయింటినెన్స్ అప్పగించాలని, ప్రతి హౌసింగ్ బ్లాక్ కి మూడు రంగులు స్పష్టంగా కనబడే విధంగా మరొక కోటింగ్ వేయించాలని, ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలోకి ప్రవేశించటానికి ప్రస్తుతం ఒకే రోడ్డు ఉన్నదని అదనముగా మరొక రోడ్డును కూడ వేయించడం జరుగుతుందని, మోడల్ హౌసింగ్ కాలనీ అంటే మోడల్ గా క్వాలిటీ బ్రహ్మాండంగా ఉండాలని, అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేయాలని, అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లు మంజూరు చేయకూడదని ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించిన తర్వాత జనాభాను బట్టి వార్డులుగా విభజించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మంత్రి మాట్లాడుతూ డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనలు, క్వాలిటీ కంట్రోల్ నిపుణుల సూచనల మేరకు వచ్చే వేసవి కాలంలో మరమ్మత్తులు చేసి అన్ని పనులు పూర్తయిన పిదప డ్యాం నింపి నీరు అందించటం జరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా, హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత, డీఎస్ఓ మోహన్ బాబు, హార్టికల్చర్ అధికారి నాగయ్య, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## రాక్‌బాల్ భారత జట్టు క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌ను అభినందించిన మాజీ మంత్రి మల్లారెడ్డి

**(వినోద్, ప్రజా తీర్పు,మేడ్చల్ జిల్లా) జూలై 10**

మేడ్చల్ జిల్లా,నేపాల్ రాజధాని ఖాట్మండులో జూన్ 27 నుంచి జూలై 3 వరకు జరిగిన ప్రతిష్టాత్మక దక్షిణాసియా తొలి రాక్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. జూలై 1న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు నేపాల్‌పై విజయం సాధించి సత్తా చాటింది. ఈ విజయవంతమైన భారత జట్టులో సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన ఇటబోయిన గోపాల్ యాదవ్, తెలంగాణ జట్టు కోచ్ చిట్కుల లక్ష్మణ్‌తో కలిసి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత జట్టు సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయ జట్టు క్రీడాకారుడు గోపాల్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మేడ్చల్ జిల్లాకు చెందిన క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో భాగస్వామి కావడం గర్వకారణమని మల్లారెడ్డి పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, పట్టుదలతో సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు.గోపాల్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మేడ్చల్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా యువతలో ప్రతిభను వెలికితీయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ సర్పంచ్ బాబు యాదవ్, మాజీ ఎంపీటీసీ రఘు, మాజీ వార్డు సభ్యుడు కొల్ల వెంకటేష్, శేఖర్ రెడ్డి, యువకులు అనిల్ యాదవ్, పరమేశ్, లక్ష్మణ్, సాయిబాబు పాల్గొన్నారు.

## ప్రజా సేవే నా లక్ష్యం - పార్టీ కోసం పట్టుదలతో పనిచేస్తా

**అశ్వారావుపేట, జూలై 10,(ప్రజా తీర్పు )**



ప్రజా సేవే లక్ష్యంగా నా ప్రయాణం ఉంటుందని. ప్రజల మధ్య ఉంటూ ప్రజల పక్షాన ప్రజా సమస్యల పై నిరంతరం పోరాడతనని, అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయుకురాలు కాసాని నాగశేషా పద్మ తెలిపారు. ప్రజాసేవ చేసే భాగ్యం నాకు కలగడం నా అదృష్టమని ఆమె పేర్కొన్నారు.అశ్వారావుపేట మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని ప్రజలకు అనారోగ్య సమస్యలు గానీ, ఇంకా ఆర్థికపరమైన ఇబ్బందులు ఆమె దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి వారికి అండగా ఉంటున్నారు. ఇక పార్టీకి సంబంధించిన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలలో ఫుల్ జోష్ నింపుతున్నారు. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ అశ్వారావుపేట రాజకీయాలను హీట్ పెంచారు ఆమె . మండలంలోనే కాకుండా తక్కువ సమయంలో రాజకీయంలోకి రంగ ప్రవేశం చేసి, రాష్ట్ర మరియు ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ నాయకుల దృష్టిని తన వైపు తిప్పుకొని, ఉక్కు మహిళ నాయుకురాలుగా పేరు తెచ్చుకున్నారు . వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్ సీఎం అవ్వడమే ప్రధాన లక్ష్యంగా పార్టీకి పని చేస్తానని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఇంకా ఆమె మాట్లాడుతూ..నా లక్ష్యం ఒకటే అధికారం లేకపోయినా పార్టీకి కష్టపడుతున్న ప్రతి ఒక్క కార్యకర్తకు, ఆర్థికంగా ఆదుకుంటూ కార్యకర్తలకు అండగా ఉంటానని, వర్గాలకు అతీతంగా పార్టీ నిబంధనలకు లోబడి క్రమశిక్షణతో ఐక్యంగా పార్టీ పూర్వవైభవం తీసుకురాటానికి నా వంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. కళ్ళు మూసిన,కళ్ళు తెరిచిన మండల పరిధిలోని పార్టీ కార్యకర్తల క్షేమం కోసం ఆలోచిస్తున్నానని ఆమె అన్నారు. నా చివరి శ్వాస ఉన్నంతవరకు పార్టీ కోసం సమన్వయంతో పని చేస్తానని తెలిపారు. ఓడిపోయామని కార్యకర్తలు ఎవరు నిరుత్సాహం పడవద్దని, ఓటమి మనల్ని మరింత బాధ్యతగా ఉండే విధంగా మన బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. రానున్నది కెసిఆర్ రామరాజ్యమని జోష్యం చెప్పారు. ఈ రామరాజ్యంలో ప్రతి పేదోడు కళ్ళల్లో ఆనందం ఉంటుందని, కుల, మత బేధాలు లేకుండా ధర్మ పరిపాలన జరుగుతుందని ఆమె తెలిపారు.పార్టీ కార్యకర్తలే పార్టీకి స్థిర బలం అని , పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత మా పై ఉందని ఆమె అన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి..

- తల్లిదండ్రుల ఆశయాలను నేరవేర్చాలి..
- రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై10**




యువత చదువుకునే సమయంలో డ్రగ్స్ జోలికి పోవద్దని, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి గారు తెలంగాణను డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దందాపై ఉక్కు పాదం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. "ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు బానిసైన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మంత్రి కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్సతో పాటు కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు ఎలాంటి సంకోచం లేకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య తో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, "నషా ముక్త్ భారత్" పోస్టర్‌ను ఆవిష్కరించారు.



## జమ్మికుంటలో 'వాసవి మినీ ప్రైవేట్ థియేటర్' ప్రారంభం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**జమ్మికుంట, జూలై 10 ప్రజాతీర్పు**

జమ్మికుంట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వాసవి మినీ ప్రైవేట్ థియేటర్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్ (భారత్ గ్యాస్ ఆఫీస్ పక్కన) ఏర్పాటు చేసిన ఈ థియేటర్‌ను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు సరికొత్త వినోద అనుభూతిని అందించేందుకు ఈ మినీ ప్రైవేట్ థియేటర్ అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ శుభకార్యాలు, స్నేహితుల ప్రత్యేక సమావేశాలను ప్రైవేట్ వాతావరణంలో, ఆహ్లాదకరంగా జరుపుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా థియేటర్ నిర్వాహకులు యాద శ్రీధర్, అనంతుల సురేష్, తంగళ్ళపల్లి శ్యామ్ కిషోర్ లకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు లెంకలపల్లి శరత్, ప్రముఖ వ్యాపారవేత్త బచ్చు భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## 'సర్' లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి..

ధర్మపురిలో 'సర్' ప్రక్రియ ను పరిశీలించిన మంత్రి అడ్లూరి

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జూలై 10**

భారత ఎన్నికల సంఘం ఓటర్ జాబితాలో సవరణ కోసం తీసుకువచ్చిన 'సర్ 'లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డులో 'సర్ 'ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితాలో సవరణ కోసం తీసుకువచ్చిన ప్రక్రియలో ప్రతి ఒక్కరు భాగస్వాములై ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఓటు హక్కును పొందాలని అన్నారు. భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును అందించారని మంత్రి అడ్లూరి అన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని అన్నారు. రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి తాను క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు మంత్రి తెలిపారు. ఓటర్లు ప్రతి ఒక్కరు అధికారులకు పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఓటరు నమోదులో భాగస్వాములు అవుతున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఓటరు నమోదుకు కావలసిన వివరాలను అందించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి సమాచారాన్ని అందించి 'సర్' లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మితో పాటు అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు నాయకులు ఉన్నారు.

## విద్యార్థుల ఆంగ్ల భాషాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

**మంథని, జూలై-10 (ప్రజాతీర్పు)**



విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపుతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యా యులు సమిష్టిగా కృషి చేయాలని మండల విద్యాధికారి ఎం. లక్ష్మి అన్నారు. మంథనిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆంగ్ల విషయ పాఠశాల సహాయ ఉపాధ్యాయుల మూడు రోజుల సేవాకాల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యా ప్రణాళికలను సమగ్రంగా రూపొందించి, విద్యా క్యాలెండర్‌కు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అభ్యసన ఫలితాలు, పనితీరు ప్రమాణాల సూచికల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులందరికీ ప్రాథమిక స్థాయి పరీక్ష నిర్వహించి, ఫలితాలను విశ్లేషించి ప్రత్యేక ఫలితాల నమోదు పుస్తకంలో నమోదు చేయాలని తెలిపారు. వాటిని తెలంగాణ పాఠశాల అనువర్తనంలో నమోదు చేసి, తక్కువ అభ్యసన స్థాయిలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక పునరావృత బోధన చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేసి, నిర్దేశించిన విద్యా లక్ష్యాలను సాధించడంలో ఆంగ్ల విషయ ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. శిక్షణలో తరగతి గది బోధన వ్యూహాలు, సృజనాత్మక కార్యకలాపాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, బొమ్మల ఆధారిత బోధన, సమగ్ర విద్య, మూల్యాంకన విధానం, కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై జిల్లా వనరుల బృంద సభ్యులు గడ్డం జగదీశ్వర్, డి. నాగరాజు, కె.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020